ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ జిల్లా వార్తలు



ఫారెస్టులో..

ఇలా చెబుదాం..

ఇదీ మా విన్నపం..



కూటమికి జేజేలు : అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్. నినాదాలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్, ఎంపీ పురందేశ్వరి, మంత్రులు నిమ్మల, దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి, మద్దిపాటి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



గోదావరి ఎగ్జిబిషన్

బాగుందయ్యా పవన్..



కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కలిసి పవన్ అభివాదం

పవన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి దుర్గేష్

ఉప్పొంగిన..గోదారి!

అఖండ గోదారి.. పవనానంద ఝరి!

- ప్రాజెక్టుకు శంకుస్థాపన
- సైన్స్ మ్యూజియం ప్రారంభం
- అటవీ అకాడమీకి భూమిపూజ
- అభివృద్ధి దిశగా అడుగులు
- వడివడిగా పవన్ పర్యటన
- అభిమానుల ఉత్సాహం
- కూటమి నేతల ఆనందం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఒక ప్రాజెక్టు పట్టాలెక్కడానికి పుష్కరకాలం పట్టింది.. ఎప్పుడో 2015లో చంద్రబాబు విజన్.. అఖండ గోదావరి ప్రాజెక్టు అది నేటికి సాధ్యమైంది.. గత వైసీపీ ప్రభుత్వంలో హేవలాక్ బ్రిడ్జిపై అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఊరించి ఉసూరుమనిపించారు.. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైందో లేదో ఆ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. గోదారిలో అభివృద్ధి దిశగా పర్యాటక అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా రూ 94.44 కోట్లతో చేపట్టనున్న అఖండగోదావరి ప్రాజెక్టుకు గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి శంకుస్థాపన చేశారు. తొలుత పుష్కరాల రేవులో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా హేవలాక్ బ్రిడ్జి, పుష్కర ఘాట్, కడియం నర్సరీ, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయం,గోదావరి కాలువ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టు దేశంలోనే ప్రఖ్యాత టూరిజం స్పాట్ అవుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేస్తున్నామన్నారు. వికసిత్ రాజమహేంద్రవరంలో భాగంగానే అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. విగ్రహాలు తొలగించకుండా గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్‌కు సూచించారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని పుష్కరఘాట్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంను హెరిటేజ్ సిటీగా గుర్తించాలని కేంద్రమంత్రిని అభ్యర్థించారు. నేను ఇప్పటికే ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించినట్టు కేంద్ర మంత్రి తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరం తూర్పు పర్యటనకు సింహద్వారమన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల ప్రజల దశాబ్దాల కల అఖండగోదావరి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ అఖండ గోదావరి కింద కేంద్రం రూ.450 కోట్లుపైబడిన పర్యాటక ప్రాజెక్టులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, పంతం నానాజీ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ఎన్ఎస్ఎస్ఎం డీజీ ఏడీ చౌదరి, వీఐటీఎం డైరెక్టర్ సాజూ భాస్కరన్, తూర్పుగోదావరి జేసీ చిన్నరాముడు, ప్రొఫెసర్ డా.కె.శరత్‌కుమార్, డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో కృష్ణనాయక్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.





మంత్రి నిమ్మలకు సన్మానం



సైన్స్ మ్యూజియం బ్రోచర్ ఆవిష్కరణ

సైన్స్ మ్యూజియానికి స్వామి జ్ఞానానంద పేరు

రాజమహేంద్రవరం: బొమ్మూరులోని సైన్స్ మ్యూజియానికి (రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం) శ్రీ స్వామి జ్ఞానానంద పేరు పరిశీలనలో ఉందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన గురువారం సైన్స్ మ్యూజియం ప్రారంభించారు. మ్యూజియంలోని నీటి వనరుల గ్యాలరీ, ఫన్ ఫర్ సైన్స్ గ్యాలరీ, తారా మండలం, ఇన్నోవేషన్ హబ్, 75 ఏళ్లలో సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్, యాక్టివిటీ హాల్ తదితర విశేషాలను సుమారు 45 నిమిషాలపాటు తిలకించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్ అండ్ టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్నాయన్నారు. ఐదెకరాల విస్తీర్ణంలో రూ.15.20 కోట్లతో విజ్ఞాన కేంద్రం నిర్మించినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్వహణలో బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నోలాజికల్ మ్యూజియం (వీఐటీఎం) ఆకృతి (డిజైన్)ని అందించిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలో జన్మించి భౌతికశాస్త్రంలో ఎన్నో అద్భుతమైన ఆవిష్కరణలు చేసి అత్యున్నత పురస్కారాలు అందుకున్న భౌతిక శాస్త్రవేత్త శ్రీ స్వామి జ్ఞానానంద పేరును ఈ కేంద్రానికి పెట్టడానికి పరిగణనలో ఉందన్నారు. కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ ఏది ఎలా పని చేస్తుందనే జిజ్ఞాస నుంచే కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తాయ న్నారు. అనంతరం విజ్ఞాన కేంద్రం బ్రోచర్‌ని ఆవిష్కరించారు.



అటవీ అకాడమీకి శంకుస్థాపన

పట్టువదలని విక్రమార్కుడు..



సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పట్టువదలని విక్రమార్కుడు. ఆయన తగ్గరు మనమే తగ్గాలి అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. మనం ఆయనను చూసి నేర్చుకోవాలి.. మనకు ఎడాప్టబులిటి రాదు.. ఆయన మనకు నేర్పిస్తార న్నారు. రాష్ట్ర హితవును.. రాజమండ్రి హితవును.. గోదావరి జిల్లాల హితవుని కోరుకునే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి మనస్ఫూర్తిగా నా నమస్కారాలు అని ఆయన చెప్పడంతో సభలో నవ్వులు విరిశాయి. అనంతరం ఈ మాటల వెనుక అర్థం ఏంటో అని అందరూ చర్చించుకోవడం మొదలుపెట్టారు. ఎన్నికలలో రూరల్ సీటు విషయమై పట్టుదల గురించి వ్యాఖ్యానించి ఉంటారని అనుకున్నారు.



యువత..కేరింత!

పవన్‌ను చూసేందుకు యువత ఉర్రూతలూగారు. పవన్‌ను చూడటానికి అభిమానులు బారీ కేడ్లను ఛేదించుకుని పుష్కర ఘాట్ వద్దకు చేరుకున్నారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతున్నంతసేపు పెద్దఎత్తున బాబులకే బాబు కల్యాణ్‌బాబు, డిప్యూటీ సీఎం జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కుర్చీలు, సౌండ్ బాక్స్‌లపైకి ఎక్కారు. దీంతో కుర్చీలు విరిగిపోయాయి. ఈ కార్యక్రమం ముగిశాక పుష్కర ఘాట్ మెయిన్ గేటులోంచి బయటకు వచ్చిన పవన్‌కల్యాణ్ అభిమానులకు అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. యువత పవన్ కాన్వాయ్ వెంట పరుగులు పెట్టారు. బైక్‌లతో దారి పొడవునా వెంబడించారు.

షూ..చారా!



హోదాతో అంటుకునే ఎలాంటి అహాన్ని పవన్ దగ్గరకు రానివ్వరు. ఆ మాటను అటవీ అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా మరోసారి పవన్ రుజువు చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో చేతిలో పెన్ను జారినా రక్కున అందించడానికి సిబ్బంది ఉంటారు. కానీ తన షూ లేసులు ఊడిపోతే పవన్ తానే స్వయంగా కట్టుకొన్నారు. సైగ చేస్తే బూటు కాలును చేతుల్లో పెట్టుకొని మరీ లేసులు కట్టే సిబ్బంది చుట్టూ ఉన్నా. తన హోదాకు ముడిపెట్టలేదు. ఆ గుణానికే జనసేనానిని జనం అంతలా అభిమానిస్తారని పలువురు అనుకోవడం వినిపించింది.



ఎస్ఐ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

మృత్యువులోనూ.. తోడుగా!



ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ జీవన్(ఫైల్)

విధి నిర్వహణలోనే కాదు.. మృత్యువులోనూ కానిస్టేబుల్ ఎస్ఐకు తోడుగా వెళ్లిపోయాడు.. ఇదీ వారిద్దరి పరిచయం గురించి తెలిసిన చాలామంది పోలీసులు కన్నీటితో చెబుతున్న మాట.. ఎందుకంటే ఇద్దరూ పనిచేసేది వేర్వేరు స్టేషన్లు అయినా ఎస్ఐ కేసు విషయమై ఎక్కడికి వెళ్లినా ఆ కానిస్టేబుల్ తోడుగా ఉండాల్సిందే.. ఇలాగే బుధవారం రాత్రి కూడా ఒక కేసు విషయమై మరో ఇద్దరితో కలిసి ఆలమూరు ఎస్ఐ అశోక్, ఆత్రేయపురంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ కారులో హైదరాబాద్ బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం కోదాడ వద్ద గురువారం తెల్లవారుజామున వీరి కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ అక్కడికక్కడే మృతిచెందారు.. దీంతో పోలీసులు హతాశులై పోయారు.. ఇద్దరి గురించి తలచుకుని కన్నీటి పర్యంతమయ్యారు.. - వివరాలు 7లో



నాడు-నేడు పనుల్లో అవకతవకలపై అధికారుల విచారణ

అమలాపురం టౌన్, జూన్26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద మంజూరు చేసిన పనుల్లో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలపై అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అప్పట్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజరాజేశ్వరిపై రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు జిల్లాస్థాయి అధికారుల బృందం గురువారం విచారణ చేపట్టింది. నాడు-నేడు పనుల్లో జరిగిన అవకతవకలపై పాఠశాల పూర్వ విద్యార్థులు, అప్పటి స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో పాటు పలువురు వేర్వేరుగా సమగ్రశిక్ష కేంద్ర కార్యాలయం (అమరావతి)కు, విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. రాజరాజేశ్వరి హెచ్‌ఎంగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయుల పట్ల వ్యవహరించిన తీరుపై కూడా ఫిర్యాదు చేశారు. వీటిపై అమరావతి కేంద్ర కార్యాలయం జిల్లాస్థాయిలో విచారణ అధికారుల బృందాన్ని నియమించింది. సమగ్రశిక్ష జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, అమలాపురం ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం తదితరుల ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాజరాజేశ్వరి కాట్రేనికోన మండలం పి.లక్ష్మీవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆమె సమక్షంలోనే ఫిర్యాదుదారులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో విచారణ నిర్వహించారు. విచారణకు హాజరైన వారందరికీ ఒక ప్రశ్నావళిని అందించి అది పూర్తిచేసి ఇమ్మన్నారు. నాడు-నేడు పనుల్లో ఎంతమేర అవినీతి జరిగింది, విచారణ అంశాలను వెల్లడించేందుకు అధికారులు అంగీకరించలేదు. విచారణ సమగ్ర నివేదికను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషాకు అందిస్తామని చెప్పారు. విచారణ అంశాన్ని మీడియాకు తెలియకుండా జాగ్రత్తపడ్డారు.

కోనసీమ జిల్లాలో వర్షపాతం

అమలాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఓమోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆయా వర్షపాతాలు ఇలా.. జిల్లాలో 18.2 మిల్లీమీటర్ల వర్షపాతం సగటున నమోదైంది. అత్యధికంగా కొత్తపేటలో 46.6, అత్యల్పంగా అంబాజీపేటలో 8.8 మిల్లీమీటర్లు నమోదైంది. ఆత్రేయపురంలో 14.6, మండపేటలో 14.6, రాయవరంలో 12, రామచంద్రపురంలో 21, ఆలమూరులో 13.2, రావులపాలెంలో 12.2, కొత్తపేటలో 46.6, కపిలేశ్వరపురంలో 20 మిల్లీమీటర్లు నమోదైంది. కె.గంగవరంలో 30.2, ఐ.పోలవరంలో 12.4, ముమ్మిడివరంలో 30.4, అయినవిల్లిలో 36.2, పి.గన్నవరంలో 29.4, అంబాజీపేటలో 8.8, మామిడికుదురులో 12.4, రాజోలులో 10.2, మలికిపురంలో 10.6, సఖినేటిపల్లిలో 10.4, అల్లవరంలో 13.4, అమలాపురంలో 13.2, ఉప్పలగుప్తంలో 13.2, కాట్రేనికోనలో 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ప్రాణాలు కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినం పురస్కరించుకుని గురువారం అమలాపురం సత్తెమ్మతల్లి గుడి దగ్గర నుంచి పేరూరుపేట వై.జంక్షన్ వరకు విద్యార్థులతో మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. మాదక ద్రవ్య రహిత సమాజాన్ని సాధించేందుకు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత జీవితాలను ఛిద్రం చేస్తున్న ఈ మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంలో పోలీస్, ఇతర అధికారులు చేస్తున్న కృషికి అందరూ సహకరించి ఈ అక్రమ మాదక ద్రవ్యాల రవాణా అరికట్టాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సమాజంలో అరాచకాలు, హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు. డ్రగ్స్ చాక్లెట్లు, ఇతర లిక్విడ్స్ రూపంలో ఎక్కడైనా తారస పడితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని జేసీ నిషాంతి సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, సీఐ పి.వీరబాబు, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్, డీఈవో షేక్ సలీంబాషా, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర,ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, వికాస జిల్లా మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి తదితరులు



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో ప్లకార్డుతో సుభాష్

డ్రగ్స్ రహిత సమాజం కూటమి ప్రభుత్వ లక్ష్యం : సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు లేని సమాజానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, మాదక ద్రవ్యాలు లేని సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సుభాష్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక ప్రదర్శనను మంత్రి సుభాష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్న డ్రగ్స్ పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు మంత్రుల కమిటీ నిత్యం పర్యవేక్షణ చేస్తుందన్నారు. డ్రోన్లు, జీపీఎస్ ట్రాకింగ్, బ్లాక్‌చైన్ ఆధారిత సీసీ టీవీలు, సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. యువతలో డ్రగ్స్, మద్యం వాడకం పెరిగిందని యువత బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించే ఇలాంటి వ్యసనాలు పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి రాజగోపాల్‌సెంటర్ వరకు ప్రదర్శన జరిపి మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, భుజంగరావు పాల్గొన్నారు.





దివాన్‌చెరువు సమీపంలోని అటవీ శిక్షణ కేంద్రంలో ఆర్ట్ గ్యాలరీని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. సభలో ప్రసంగిస్తున్న పవన్, పక్కన మంత్రి దుర్గేష్ తదితరులు

23 శాతం పచ్చదనమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- భావితరాల కోసం ప్రభుత్వం చర్యలు
- అటవీ అకాడమీ శాశ్వత భవనానికి శంకుస్థాపన, ఆర్ట్ గ్యాలరీ పరిశీలన

దివాన్‌చెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో 23 శాతం భూభాగం పచ్చదనం కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో అటవీ ప్రాంతాల అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. స్థానిక దివాన్‌చెరువు అటవీ శిక్షణా కేంద్రంలో రూ.18.34 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాష్ట్ర అటవీ అకాడమి శాశ్వత భవనానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకోసం పచ్చదనం కలిగిన ప్రాంతాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో పచ్చదనాన్ని 23 శాతం వరకూ పెంచాలనే సంకల్పంతో కేబినెట్‌లో ప్రత్యేకంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధంచేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర అటవీ శిక్షణా కేంద్రానికి కొత్త మౌలిక సదుపాయాలు కల్పించడానికి సహకరించిన ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా అటవీ అధికారులకు, ఫ్రంట్‌లైన్ సిబ్బందికి శిక్షణను ఇవ్వడంతోపాటు వర్క్‌షాప్‌లు, సెమినార్‌లతో వారి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రతిపాదిత మౌలిక సదుపాయాలు సహాయపడతాయని అన్నారు. భవిష్యత్ తరాలు కలుషితంలేని వాతావరణంలో నివసించేవిధంగా శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిషోర్, ఏపీపీఎఫ్‌డీసీ వీసీ, ఎండీ ఆర్పీ ఖజూరియా, అడిషనల్ పీసీసీఎఫ్‌లు శాంతి ప్రియపాండే, రాహుల్‌పాండే, సీసీఎఫ్ బీఎన్ఎన్ మూర్తి, డీఎఫ్‌వోలు వి.ప్రభాకరరావు, ఏవీ ప్రసాదరావు, అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్, ఆర్ఎం టి.జ్యోతి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పవన్ చేతికి పగడం, నాగసర్ప ఉంగరాలు

రాజమహేంద్రవరం, జూన్26(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ అంటేనే క్రేజ్ వేరే లెవెల్లో ఉంటుంది. రాజమహేంద్రవరం వచ్చిన పవన్ చేతి వేళ్లకు ధరించిన ఉంగరాలు కూడా అభిమానుల చూపుల తరంగాలు వదల్లేదు మరి. ఆయన కుడి చేతి మధ్య వేలుకు నాగసర్పం, ఉంగరం వేలుకు పగడం ఉంగరాలను ధరించారు. ఆధ్యాత్మిక చింతన ఎక్కువగానే ఉన్న పవన్‌కల్యాణ్.. ఆ ఉంగరాలను ధరించడం అతిశయోక్తి కాదు. ఆ మధ్య రాష్ట్ర మేలును కోరుతూ తమిళనాట ప్రసిద్ధ క్షేత్రాలనూ దర్శించారు. గురువారం పర్యటనలో పవన్ పెట్టుకున్న ఉంగరాలపై అభిమానుల్లోను, జనసేన నేతల్లోనూ చిన్నపాటి చర్చ సాగింది. పగడపు రాయి ప్రతికూల శక్తులను తిప్పికొట్టడంతోపాటు చెడు దృష్టి నుంచి కాపాడుతుందని నమ్మిక. నాగసర్ప ఉంగరాన్ని కాలసర్ప దోషాన్ని నివారించడానికి ధరిస్తారు. సర్పం అదృష్టానికి ప్రతీక అని కూడా నమ్ముతారు.

పవన్, షెకావత్‌లకు స్వాగతం





పవన్‌కల్యాణ్, షెకావత్‌లకు ఎయిర్‌పోర్టు వద్ద స్వాగతం పలుకుతున్న నాయకులు

కోరుకొండ/రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం ఉదయం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు, కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, జనసేన సీనియర్ నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్ శాలువాలుకప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ముందుగా కేంద్రమంత్రి విమానాశ్రమానికి విచ్చేశారు. తరువాత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వచ్చారు. కార్యక్రమాల తర్వాత కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మధ్యాహ్నం ఎయిర్‌పోర్టు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కేంద్రమంత్రికి సాదర వీడ్కోలు పలికారు.



హేవ్‌లాక్ బ్రిడ్జి సుందరీకరణ కార్యక్రమంలో పవన్‌కల్యాణ్‌కు కనిపించేలా ఫ్లెక్సీ చూపిస్తున్న విద్యార్థిని వెన్నెల కుటుంబ సభ్యులు

'ఇంకా న్యాయం జరగలేదు అన్నయ్యా'

రాజమహేంద్రవరంసిటీ, జూన్26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో హేవ్‌లాక్ బ్రిడ్జి సుందరీకరణ పనుల శంకుస్థాపనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మీడియానుద్దేశించి మాట్లాడుతుండగా కొంతమంది మడికి గ్రామానికి చెందిన విద్యార్థిని వెన్నెల ఫ్లెక్సీని 'ఇంకా న్యాయం జరగలేదు అన్నయ్యా' అంటూ ప్రదర్శించారు. గత ఏడాది ప్రైవేట్ విద్యాసంస్థలో పదో తరగతి చదువుతున్న వెన్నెల అనే బాలిక ఆ విద్యాసంస్థలో ఆత్మహత్య చేసుకుంది. దీనికి ఆ విద్యాసంస్థ నిర్వాహకులే కారణమని బాధిత కుటుంబం ఆరోపించింది. అదే సమయంలో తూర్పు పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్‌ను రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు వద్ద బాధిత కుటుంబ సభ్యులు కలిసి మొరపెట్టుకున్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని పవన్ అప్పట్లో హామీ ఇచ్చారు. గురువారం రాజమహేంద్రవరం వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కు పుష్కరాల రేవు వద్ద బాధిత కుటుంబం మృతి చెందిన బాలిక ఫ్లెక్సీ ప్రదర్శించగా, ఇది గమనించిన ఆయన అధికారులతో మాట్లాడతానని పవన్ చెప్పారు.



డిప్యూటీ సీఎం పవన్ తమకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఓ కుటుంబం

పవన్ సారూ.. మాకు న్యాయం చేయండి!

దివాన్‌చెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురైన తమ మైనర్ బాలికను కాపాడాలని కాకినాడ జిల్లా కరపకు చెందిన ఓ కుటుంబం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీ వద్ద ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించింది. దివాన్‌చెరువులోని ప్రాంతీయ అటవీ పరిశోధనా స్థానం ప్రాంగణంలో రాష్ట్ర అటవీ అకాడమి శాశ్వత భవనాలకు గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కరపకు చెందిన ఓ కుటుంబం, వారి బంధువులు అక్కడకు చేరుకుని పవన్‌కల్యాణ్ దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లే ప్రయత్నం చేసింది. అనంతరం స్థానిక విలేకరులకు తమ సమస్యను వివరిస్తూ తమ కుమార్తె (14) ఈనెల 6వ తేదీన కిడ్నాప్‌కు గురైందని వాపోయారు. 9వతరగతి చదువుతున్న బాలిక స్నేహితుల పుట్టినరోజు పార్టీకి వెళుతున్నట్టు తమతో చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదన్నారు. దీనికి సంబంధించి పోలీసులను ఆశ్రయించినప్పటికీ తమ కుమార్తె జాడ కానరాలేదన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానాలు వ్యక్తంచేశారు. పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్తే న్యాయం జరుగుతుందన్న ఆశతో వచ్చామని చెప్పారు.

గోడు విన్నవించుకుందామని..



తమ బిడ్డతో పవన్ కోసం ఎదురుచూపులు

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అసలే పేదరికం.. ఆపై బిడ్డకు అంతుబట్టని వ్యాధి. ఉన్నదంతా ఊడ్చి ఇప్పటివరకూ ప్రాణాలు నిలబెట్టారు. ఇకపై వేరే దారి లేదు. ఈ దీనస్థితిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కి విన్నవిద్దామని వచ్చి.. నిరాశగా వెనుదిరిగారు ఆ బాధితులు. చాగల్లుకు చెందిన సీతా వీర వెంకట సతీశ్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెక్కాడితేగానీ డొక్కాడని దుస్థితి. భార్య దుర్గా రోషిణికి మూడేళ్ల కిందట ఆడబిడ్డ జన్మించింది. కానీ ఆ ఆనందం కంటే దుఃఖమే ఎక్కువైంది. ఆ బిడ్డ అరుదైన చర్మ వ్యాధితో పుట్టింది. పురిటిలో ఎలా ఉందో మూడేళ్లకు అలాగే ఉంది. ఎదుగుదల, శరీరక మార్పులు లేవు. గట్టిగా పట్టుకుంటే చర్మం ఊడిపోతోంది. శరీరమంతా చర్మ వ్యాధి. తండ్రి రోజూ డ్రెస్సింగ్ చేసి కూలి పనికి వెళ్తాడు. తనకున్న ఇల్లు బ్యాంకులో తనఖా పెట్టి రూ.5 లక్షలు వైద్యానికి సతీశ్ ఖర్చుచేశాడు. కానీ ఫలితం లేదు. రెండో బిడ్డ కడుపులో ఉండగానే తొలి బిడ్డ మాదిరిగానే పుడుతుందేమోననే భయంతో వైద్యుల సలహాలతో రూ.2 లక్షలు ఖర్చు చేశాడు. ఈ క్రమంలో రూ.10 లక్షల వరకూ అప్పులపాలయ్యాడు. ఇక పైసా కూడా చేతిలో లేదు. లక్షల్లో ఒకరికి ఈ వ్యాధి వస్తుందని వైద్యులు చెప్పారు. వైద్యానికి చాలా మొత్తం ఖర్చవుతుందన్నారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఓ లక్ష రూపాయలను ఉదారంగా మంజూరు చేయించారు. ఆ చెక్కును పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అందజేస్తామని అధికారులు చెప్పారు. తన దుస్థితిని, ఆర్థిక ఇబ్బందులను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లవచ్చని అనుకున్నారు. బిడ్డ, భార్య, తల్లిని తీసుకొని సైన్స్ మ్యూజియం వద్దకు వచ్చారు. అక్కడ డిప్యూటీ సీఎంని కలవడానికి వీలు కల్పించలేదు. ఎయిర్‌పోర్టుకు రమ్మంటే అక్కడికి వెళ్లారు. పవన్‌కల్యాణ్ వెళ్లిపోవడంతో చాలా నిరాశ చెందారు. అయితే లక్ష చెక్కును మంత్రి దుర్గేష్ అందించగా.. బరువెక్కిన గుండెలతో ఇంటిదారి పట్టారు. పవన్‌కల్యాణ్‌ని కలిస్తే తమకు ఒక దారి దొరికేదని, తమ బిడ్డ ప్రాణాలకు పూర్తి భరోసా దక్కేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కూలి పని చేస్తూ ఐదుగురితో కూడిన సంసారాన్ని.. బిడ్డ వైద్యాన్ని నెట్టుకురావాలని.. అలా గడవని నాడు చావే గతి అని ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేయడం హృదయాలను కలచివేసింది.

25శాతం కంటే తక్కువ అడ్మిషన్లు ఉన్న కళాశాలలకు నోటీసులు

దివాన్‌చెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా 25శాతం కంటే తక్కువ అడ్మిషన్లతో పనిచేస్తున్న కళాశాలలకు నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు ఆదేశించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అధికారులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. విద్యాపరమైన అంశాలపై యాప్సీ ఆధ్వర్యం లో అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు, రిజిస్ట్రార్‌లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు విషయాలు చర్చించారు. ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్న క్వాంటం టెక్నాలజీ వర్క్‌షాప్‌పై రాష్ట్ర ఉన్నత విద్యశాఖ ఆధ్వర్యంలో వీసీలు, క్వాంటం టెక్నాలజీ సంబంధిత అధ్యాపకులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. చర్చించిన అంశాలపై నన్నయ వీసీ ప్రసన్నశ్రీ అధికారులతో సమీక్షించారు.

డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవోగా ప్రవీణ్‌కుమార్

కాకినాడరూరల్, జూన్26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవోగా పి.ప్రవీణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఈవోగా పనిచేసిన ఆర్వీ నరసింహారావు నియామకం చెల్లదని ఆర్‌బీఐ చెప్పడంతో ఆయన రాజీనామా చేశారు. మూడేళ్ల క్రితం ఆయన సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. 2024, డిసెంబరు 31న ఉద్యోగ విరమణ ముగియడంతో ఆయనకు ఏడాది పాటు సీఈవోగా పొడిగింపు ఇవ్వాలని ఆప్కాబ్‌కు కాకినాడ జిల్లా జేసీ రాహుల్ మీనా లేఖ రాశారు. ఆయన అభ్యర్థన మేరకు ఆరు నెలలుగా నరసింహారావు సీఈవోగా కొనసాగుతున్నారు. ఎటువంటి ఇంటర్వ్యూలు లేకుండా డీసీసీబీ సీఈవోగా ఆయన నియామకం చెల్లదంటూ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చెప్పడంతో ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దీంతో ఇన్‌చార్జి సీఈవోగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



వెంకన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న దేవదాయశాఖ ఆర్‌జేసీ

- వాడపల్లి వెంకన్న ఆలయ ప్రత్యేకాధికారి త్రినాథరావు

ఆత్రేయపురం,జూన్ 26(ఆంధ్రజ్యోతి): వాడపలి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనరు, ప్రత్యేకాధికారి వేంద్ర త్రినాథరావు అన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామిని గురువారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను ఆ యన పరిశీలించారు. వాడపల్లి, అన్నవరం, సింహాచలం దేవస్థానాలకు ప్రత్యేకాధికారిగా నియమించినట్లుగా తెలిపారు. ప్రభుత్వం దేవాలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. పారిశుధ్య నిర్మూలన, భక్తుల సమస్యల పరిష్కరించడం, అన్నప్రసాదం రుచికరంగా అందించడం, క్యూకాంప్లెక్స్‌లో భక్తులకు స్వామి దర్శనం సకాలంలో అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఆలయ తిరువీధులు, పార్కింగ్‌ప్రదేశాలు, ఆలయంలోని క్యూలైన్లు అన్నదాన సత్రం, లడ్డూ ప్రసాద తయారీ, విక్రయాలు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. చిన్నారులు, తల్లి పాలు ఇచ్చేందుకు మరో రెండు సెంటర్లను, దివ్యాంగులు, వృద్ధులకు వీల్‌చైర్‌లో ఆలయంలోకి వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటు, క్యూకాంప్లెక్స్‌కు ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం, క్యూలైన్లను ఆయన పరిశీలించారు. మళ్లీ 15 రో జుల్లోగా ఈ క్షేత్రాన్ని పరిశీలిస్తానన్నారు. భక్తులకు స్వామివారి దర్శనం అన్నప్రసాదం పరిసరాల పరిశుభ్రత ఉండేలా ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

10 అడుగులు.. 300 కాయలు

- అంబాజీపేటలో అబ్బురపరిచిన అరటిగెల

అంబాజీపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలానికి చెందిన కొర్లపాటి వెంకటేశ్వరావు తన పెరట్లో సేంద్రియ ఎరువులతో పెంచిన అరటి చెట్టు 10 అడుగులతో ఉన్న పచ్చ అరటిగెల 300 కాయలతో కాసి అబ్బురపరిచింది. టిష్యూకల్చర్‌లో భాగంగా గింజ నాటడం ద్వారా వచ్చిన మొక్కను స్థానిక పండ్ల వ్యాపారి ఇచ్చినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మొక్కను పెరట్లో నాటి సేంద్రియ ఎరువులతో పెంచడంతో 10 అడుగులున్న అరటిగెల కాసింది. చెట్టుకు భారం కాకుండా కర్రలతో చెట్టును బలంగా కట్టడంతో అరటిగెల ఇబ్బంది లేకుండా పెరిగిందన్నారు. ఈ భారీ అరటిగెలను మార్కెట్‌లో అందరూ ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.



మార్కెట్‌లో 10 అడుగులు ఉన్న పచ్చ అరటిగెల

వ్యవసాయశాఖలో పలువురికి స్థానచలనం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా సహాయ సంచాలకులకు బదిలీలు

సామర్లకోట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో సహాయ సంచాలకులకు స్థానచలనం కల్పిస్తూ కమిషనరు ఎస్.ఢిల్లీరావు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ అంబేడ్కర్ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీగా పనిచేసిన కె.దుర్గాలక్ష్మి కాకినాడ బదిలీ అయ్యారు. కాకినాడ ఏడీగా పనిచేస్తూ ఆరు నెలల క్రితం విశాఖ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లిన జీవీ పద్మశ్రీని తుని బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న జి.శ్రీనివాసును జగ్గంపేటకు, పెద్దాపురం డీఆర్సీ కేంద్రం డీటీసీ ఏడీ పి.మాధవిని సామర్లకోటలోని జిల్లా భూసార పరీక్ష కేంద్రానికి, తుని ఏడీ సుంకర బుల్లిబాబును పెద్దాపురం డీఆర్సీ, డీటీసీ కేంద్రానికి, జగ్గంపేట ఏడీ జి.శైలజను ఏలూరు డీఆర్సీ, డీటీసీ కేంద్రానికి, అమలాపురం ఏడీ ఎంఏ షంషీని ముమ్మిడివరం, రామచంద్రపురం ఏడీ ఏవీఎస్ రంగారావును ఎన్టీఆర్ కృష్ణా జిల్లా తిరువూరుకు, ఆలమూరు ఏడీ కాకి నాగేశ్వరరావును పి.గన్నవరం, ఎన్టీఆర్ కృష్ణా జిల్లా తిరువూరు ఏడీ జి.కెన్నడీని అమలాపురం, పి.గన్నవరం ఏడీ ఎస్‌జేవీ మోహనరావును అల్లూరి జిల్లా రంపచోడవరం, అక్కడ పనిచేస్తున్న చాపర్ల కాశీ విశ్వనాథ చౌదరిని ఆలమూరు, విజయనగరం జిల్లా బొబ్బిలి ఏడీ దారా మాలకొండయ్యను పెద్దాపురం డీఆర్సీ, డీటీసీ కేంద్రానికి బదిలీ చేశారు. వీరంతా రెండురోజుల్లో నిర్దేశించిన డివిజన్లలో బాధ్యతలు స్వీకరించాలన్నారు.

పుష్కర కాలువను పరిశీలించిన సెంట్రల్ వాటర్ కమిషన్

తుని రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై గ్రౌండ్ రియాల్టీని అధ్యయనం చేసేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ ఉన్నతాధికారుల బృందం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం తుని మండలం పుష్కర ఆయకట్టు ప్రాంతాన్ని గురువారం పరిశీలించింది.



సుబేదార్ వినోద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

సుబేదార్‌కు సత్కారం

పెద్దాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పెహల్గాం ఉగ్ర దాడికి వ్యతిరేకంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దేశ ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని పెంచిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో పెద్దాపురానికి చెందిన సుబేదార్ వినోద్ దడాల పాల్గొన్నారు. గురువారం ఆయన్ను ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి నేతలు రాజా సూరిబాబురాజు, తూతిక రాజు, మహ్మద్ ఆరిఫ్ అలీ, పొలమరశెట్టి సత్తిబాబు, నూనె రామారావు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.1.45 కోట్లు



వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

- బంగారం 37 గ్రాములు, వెండి 890 గ్రాములు, విదేశీ కరెన్సీ నోట్లు కూడా..

ఆత్రేయపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం లెక్కింపు నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ, పర్యవేక్షణాధికారులు, టీవీవీఎస్ కామేశ్వరరావు, బి.కిరణ్ పర్యవేక్షణలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 28రోజులకుగాను ప్రస్తుత లెక్కింపు ప్రకారం ప్రధాన హుండీల ద్వారా రూ.1,22,85,766 లభించింది. అన్నప్రసాద హుండీల ద్వారా రూ.22,30,833 వెరసి స్వామి వారి ఆదాయం రూ.1,45,16,599 లభించింది. బంగారం 97గ్రాములు, వెండి 890 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ నోట్లు హుండీ ద్వారా లభించినట్లు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు, బ్యాంకు, పోలీసులు పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న అన్నవరం ఈవో

వాడపల్లి వేంకటేశ్వరస్వామిని గురువారం అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు దంపతులు దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి చిత్రపటాన్ని ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఈవోకు అందించారు.

లోవలో ప్రారంభమైన ఆషాఢ మాసోత్సవాలు

తునిరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తుని లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకను పురస్కరించుని అమ్మవారికి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన భాగ్యం కల్పించడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆషాఢ పర్వదిన వేళ అమ్మవారికి అలంకరణలు, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు రాణి శర్మ తెలిపారు.



విశేష అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

ఉప్పాడ తీరంలో కానా గొరసల సందడి

- వేట నిషేధం తర్వాత మత్స్యకారుల వలలకు విరివిగా చేపలు

కొత్తపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సముద్రుడు కనికరించాడు. కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో గురువారం వేటకు వెళ్లిన మత్స్యకారులకు విరివిగా కానాగొరసరకం చేపలు పడ్డాయి. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. వేట నిషేధం ముగిసిన పదిరోజులకు వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు విరివిగా కానాగొరసలు లభ్యమయ్యాయి. ఇటీవల కాలంలో సముద్రంలో చేపలు దొరక్క కనీసం డీజిల్ డబ్బులు కూడా రాకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతిరోజూ వేటకు వెళ్లడం వలలకు చేపలు చిక్కకపోవడం తిరిగి ఒడ్డుకు రావడం చేసేవారు. గురువారం ఉప్పాడ తీర ప్రాంతాలకు చెందిన బోట్లన్నీ ఒకేసారి సముద్రంలో వేటకు వెళ్లడం, దీంతో అందరికీ కానా గొరసలు దొరకడంతో వారంతా ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. విరివిగా దొరికిన చేపలను ఒడిషా, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ముమ్ముందు మరిన్ని పెద్ద చేపలు పడతాయని వారంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పాడ తీరంలో మత్స్యకారులకు లభ్యమైన కానా గొరస చేపలు

నువ్వు లేక నేను లేను..!

- కొంతకాలం క్రితం ప్రేమికురాలు మృతి
- తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందు తాగిన యువకుడు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి... దుర్గాడలో ఘటన


ఎం. విజయకుమార్(ఫైల్)

గొల్లప్రోలు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి చనిపోయిందని తీవ్ర మనస్థాపం చెంది ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో జరిగింది. గ్రామానికి చెందిన ములగపాటి విజయకుమార్ (24) ఆర్టీసీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేసి మానేశా డు. అతడి తల్లి నాగమణి వంట పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. అయితే విజయకుమార్ ప్రేమించిన అమ్మాయి కొంతకాలం క్రితం చనిపోయింది. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపంతో విజయకుమార్ బాధపడుతున్నాడు. ఒక్కోసారి తనకు చనిపోవాలని ఉందని తల్లితో చెప్పేవాడు. దీంతో ఆమె కుమారుడికి మనోధైర్యం చెప్పి భరోసా కల్పించేది. ఈ క్రమంలో నెల క్రితం నాగమణి వంట పనికోసం విజయవాడ, బందరుకు వెళ్లింది. విజయకుమార్ తన అన్నతో కలిసి ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా ఈ నెల 24వ తేదీ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతడి అన్న తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. తన భర్త సూరిబాబు నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడని, ఇప్పుడు చిన్న కుమారుడు మృతి చెందాడని నాగమణి భోరున విలపించింది.

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ / ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


కొయ్యా ముత్యాలు మృతదేహం

తాళ్లపూడి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట వద్ద గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, ఇంకొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం .. అన్నదేవరపేటకు చెందిన కొయ్య ముత్యాలు (28) ఠాగూర్ ఫ్యాక్టరీలో పని ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన ఎస్కే సుధీర్ తాళ్లపూడి నుంచి అన్నదేవరపేట వైపు వస్తూ అన్నదేవరపేట సొసైటీ సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. గాయాలపాలైన సుధీర్‌ని 108 అంబులెన్స్‌లో గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టీ. రామకృష్ణ తెలిపారు.

రైలు నుంచి జారిపడి మరొకరు...

తునిరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తిమృతి చెందిన ఘటన తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. యలమంచిలి-నర్సింగ్‌పల్లి మధ్య 45 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 9490619020 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

రెండు ఇసుక లారీలు సీజ్



కొవ్వూరు, జూన్26 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్‌లో బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్టు కొవ్వూరు సబ్ డివిజనల్ టాస్క్‌ఫోర్సు ఏఎస్ఐ జీఆర్కే గంగాధరరావు తెలిపారు. గురువారం వాడపల్లి నుంచి సీతంపేట వైపు 25 టన్నుల ఇసుకతో వెళ్తున్న లారీని గుర్తించి కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే తాళ్లపూడి ఇసుకర్యాంపు నుంచి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గజ్జరం చింతల్లో టాస్క్‌ఫోర్సు అధికారులు పట్టుకున్నారు. లారీని సీజ్‌చేసి డ్రైవర్‌ను తాళ్లపూడి పోలీస్టేషన్‌లో అప్పగించినట్టు టాస్క్‌ఫోర్సు ఏఎస్ఐ తెలిపారు.

విధి నిర్వహణలో ఒక్కటై..

చివరికి మృత్యువులోనూ...

- తెలంగాణలోని కోదాడ వద్ద రోడ్డు ప్రమాదంలో ఆలమూరు ఎస్ఐ, కానిస్టేబుల్ దుర్మరణం
- పోలీసు వర్గాల్లో తీవ్ర విషాదం


ఆలమూరు పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సిబ్బంది

ఆలమూరు/ఆత్రేయపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరించే గుణం.. న్యాయం కోసం వచ్చేవారికి అండగా నిలవాలనే తపన.. నిందితులు ఎక్కడివారైనా అరెస్టు చేసేదాకా పట్టుదలగా పనిచేసే నైజం.. విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందిన చరిత్ర ఆలమూరు సబ్ ఇన్స్‌పెక్టర్ ముద్దాల అశోక్‌ది. నిందితులను పట్టుకోవడంతో చురుకుగా వ్యవహరిస్తూ, క్రైం బృందంలో మెరుగైన పనితీరుతో ఆకట్టుకునే ప్రత్యేకత కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్‌ది. పోలీసు కేసుల దర్యాప్తులో ఉన్న చురుకుదనం, ఆసక్తే ఈ ఇద్దరినీ కొన్నేళ్ల నుంచి ఒక్కటిగా కలిపి ఉంచుతోంది. కానీ విధి వక్రించి రోడ్డు ప్రమాద రూపంలో వీరిని కబళించి, పోలీసు వర్గాలు, బంధుమిత్రుల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్రం కోదాడ సమీపంలోని దుర్గాపురం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు సబ్‌ఇన్స్‌పెక్టర్ ఎం. అశోక్ (46), ఆత్రేయపురం కానిస్టేబుల్ ఎస్.బ్లెసన్‌జీవన్(32) మృతిచెందారు. ఆలమూరు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసులో నిందితులను గుర్తించడానికి హైదరాబాద్‌కు ఎస్ఐ అశోక్.. కానిస్టేబుళ్లు బ్లెసన్, స్వామి,డ్రైవర్ రమేష్ కారులో వెళుతుండగా వీరి కారును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ అక్కడిక్కడే మృతి చెందారు. స్వామి, రమేష్‌కు గాయాలుకావడంతో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రమాద వార్త తెలియగానే ఆలమూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒకరిని చిరునవ్వుతో పలకరించే అశోక్ ఆలమూరు వచ్చి ఏడాది గడవకముందే అందరి మన్ననలు పొందారు. ఇప్పుడు ఎస్ఐ అశోక్ లేరనే విషయాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. అశోక్ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని రాయపేట. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమారులు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎస్ఐగా విధులు నిర్వహించడంతో ఆయన పనిచేసిన ప్రతీచోట అనేక మంది అభిమానులను సంపాదించుకున్నారు. గురువారం సాయంత్రం నరసాపురంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఇక కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ ఆత్రేయపురం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. బ్లెసన్ తల్లి, ఇద్దరు సోదరులతో ఆలమూరులో నివాసముంటున్నారు. రావులపాలెం సర్కిల్ పరిధిలోని క్రైం విభాగంలో విధులకు హాజరవుతున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఎస్ఐ అశోక్‌తో బ్లెసన్‌కు మంచి సాన్నిహిత్యంగా ఉంది. ఎన్నో కేసులను ఎస్ఐ అశోక్.. జీవన్‌తో కలిసి విచారణ నిర్వహించారు. మూడురోజుల కిందట జరిగిన ఆలమూరు పోలీసు స్టేషన్‌లో జీవన్ పుట్టిన రోజు వేడుకలు చేసుకోగా ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు. ఇంతలోనే వారిద్దరు మృతి చెందడంతో పోలీస్ సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ మృతి పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆలమూరు కూటమి నేతలు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, సూరపురెడ్డి సత్య, గారపాటి శ్రీనివాస్, మెర్ల గోపాలస్వామి, పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ మృతదేహాలకు ఎస్పీ నివాళి


ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెసన్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ

ఆలమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ అశోక్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం నరసాపురంలో గురువారం సాయంత్రం అంతక్రియలు నిర్వహించారు. దీనికి జిల్లా ఎస్పీ కృష్ణారావుతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, ఆలమూరు మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళి అర్పించారు. అలాగే ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఆలమూరుకు తరలించారు. అక్కడకి ఎస్పీ వెళ్లి నివాళి అర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్టు బ్లెసన్ బంధువులు తెలిపారు. ఈయనతో పాటు పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అమలాపురం: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ కుటుంబ సభ్యులను కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నర్సాపురంలో అతని స్వగ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, తదితర సిబ్బంది ఉన్నారు.

సీఎం చంద్రబాబు సంతాపం

అమలాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కోదాడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ కుటుంబాలకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్ స్వామి, డ్రైవర్ రమేష్‌కు అందుతున్న వైద్య సాయంపై అధికారులతో మాట్లాడినట్టు ఒక సందేశంలో తెలిపారు. విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు, బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున అధికారులు అండగా ఉండి వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు...

ఆలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ మృతిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. అలాగే క్షతగాత్రులైన మరో కానిస్టేబుల్, డ్రైవర్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యానిస్తూ సంతాపం తెలియజేయడంతో పాటు వారిని అన్నివిధాలా ఆదుకుంటామని ఒక సందేశంలో భరోసా ఇచ్చారు. సమాజంలో పోలీసుల సేవలు వెలకట్టలేనివని అన్నారు.

ఆస్తికోసం మరదలిపై కాంగ్రెస్ నేత దాడి


హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న త్రివేణి

కూనవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం మరదలిపై దాడికి పాల్పడ్డాడు ఓ కాంగ్రెస్ నేత. వివరాల్లోకి వెళితే అల్లూరి జిల్లా కూనవరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శ్రీమంతుల వెంకటరమణ పనిచేస్తున్నాడు. దీనిపై బాధితురాలి తల్లిదండ్రులు తాటి చంద్రశేఖరరావు, నాగమణి మాట్లాడుతూ తన కూతురైన త్రివేణిపై వెంకటరమణ దాడి చేశాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె వెన్నుపూసకు ఫ్యాక్చర్ కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందన్నారు. దాడి వెనుక వెంకటరమణ భార్య నీలిమ, అక్క, చెల్లెళ్లు బోనాసు దుర్గాభవాని, బెజ్జిని రమాపార్వతి, ఎడవల్లి ధనలక్ష్మి హస్తం ఉందన్నారు. దీనిపై కూనవరం ఎస్ఐ లతాశ్రీ కేసు నమోదు చేశారు.

పాముకాటుతో అపస్మారకస్థితిలోకి యువకుడు

ప్రత్తిపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంకి చెందిన యువకుడు ఉర్లంకల మణికుమార్ పాముకాటుకు గురయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రోజువారీ వ్యవసాయ పనుల నిమిత్తం 10 మంది కూలీలు గురువారం పనికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఆరుగంటల సమయంలో పనులు ముగించుకుని ఇంటికి బయల్దేరగా, మణికుమార్ కుడికాలి పాదంపై నాగుపాము కాటువేసింది. దీంతో నోటి నుంచి నురగలు వస్తూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో తోటి వ్యవసాయ కూలీలు ప్రత్తిపాడులోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు 20 వరకు అందించారు. ప్రస్తుతం మణికుమార్ అపస్మారక స్థితి నుంచి తేరుకోవడంతో తల్లిదండ్రులు ఉర్లంకల లోవరాజు, కృష్ణవేణి, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ సకాలంలో పాముకాటుకు గురైనవారిని తెస్తే ప్రమాదం నుంచి కాపాడుకోవచ్చన్నారు.

లోవలో జూదాలు

దేవస్థానానికి వచ్చే భక్తులను దోచుకుంటున్న ముఠాలు

విజయనగరం వాసి నిలువు దోపిడీ


గురువారం మధ్యాహ్నాం లోవలో ముక్కాట నిర్వహిస్తున్న యువకుడు, డబ్బులు కాస్తున్న భక్తులు

తుని రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో జూదాలు జోరుగా సాగుతున్నాయి. వ్యయప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి లోవకు వస్తున్న భక్తులే లక్ష్యంగా కొందరు అక్రమార్కులు సమూహంగా ఏర్పడి భక్తులను జూదాల వలలోకి దించి నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. పేకాట, గుండాట, లోపల-బయట, బుక్కాట, బొమ్మాట అంటూ పేక ముక్కలతో మాయ చేస్తూ భక్తుల వద్ద ఉన్న నగదుతో పాటుగా చేతికి ధరించిన బంగారు ఆభరణాలను దోచుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారం గత వైసీపీ పాలనలో ఓ ప్రజా ప్రతినిధి అండదండలతో ఐదేళ్ల యధేచ్ఛగా సాగింది. అదే తీరు కూటమి పాలనలోను సాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం విజయనగరం శివారు ఓ మారుమూల గ్రామం నుంచి ఓ భక్తులు లోవ దేవస్థానానికి వచ్చాడు. రోడ్డు పక్కనే కొందరు స్థానిక వ్యక్తులు ముక్కాట నిర్వహించి ఆయన వద్ద ఉన్న నగదు మొత్తం దోచేశారు. దీంతో తిగిరి ఇంటికి వెళ్లేందుకు సైతం జేబులో చిల్లు గవ్వ లేకపోవడంతో ఉసూరుమన్నారు. ఇదే తరహాలో నిత్యం ఈ పరిణామాలు లోవలో జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.ఆషాఢమాసం సందర్భంగా లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా ఆలయ అధికారులతో పాటు పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి లోవ దేవస్థానంలో జూదాలను కట్టడి చేయాలని భక్తులు కోరుతున్నారు.

తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు 12 మెడల్స్

రాష్ట్రంలో 3వ స్థానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా



ఆలిండియా తైక్వాండో ఫెడరేషన్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ శర్మతో మెడల్స్ సాధించిన క్రీడాకారులు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగిన 42వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారులు 12 మెడల్స్ సాధించారు. జాతీయ స్థాయిలో రాష్ట్రంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 3వ స్థానంలో నిలిచిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో సెక్రటరీ, కోచ్ బి.అర్జునరావు తెలిపారు. ఎన్.అఖిల్ (రెండు గోల్డ్), బి.శ్రీస్నేహ (ఒక గోల్డ్, ఒక బ్రాంజ్), సీహెచ్ హారిక (ఒక సిల్వర్, ఒక బ్రాంజ్), టీఎస్ కార్తికరాజు, ఎన్.తన్వీర్ సత్యం, ఎస్ఎస్ఎస్ఎస్ వెంకటరెడ్డి, జి.లాహితి తేజ, ఎం.జయలక్ష్మి, ఎస్.మోక్షజ్ఞ, ఎన్‌వీడీ మల్లిక బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, చుండ్రు గోవిందరాజు, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, తైక్వాండో అధ్యక్షుడు ఆకుల మధుసూదనరావు, నేషనల్ రిఫరీస్ డీఎస్ సత్యనారాయణ, కేవీ సత్యనారాయణ, పి.త్రిమూర్తులు, మణికంఠ, డి.తులసి, జి.లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

లాగరాయి వైద్యాధికారి సస్పెన్షన్


ఆసుపత్రిలో పీవోకి వివరాలు తెలియజేస్తున్న సర్పంచ్

రాజవొమ్మంగి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి నాగార్జునను సస్పెండ్ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యాధికారి అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఆసుపత్రిలో మందుల కొరత ఉన్నా సదరు వైద్యాధికారి పట్టించుకోకుండా ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని ఐటీడీఏ పీవోకు, అల్లూరి జిల్లా వైద్యాధికారికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి బుధవారం ఫోనులో ఫిర్యాదు చేశారు. దీంతో పీవో గురువారం లాగరాయి ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కూడా వైద్యాధికారి ఆసుపత్రిలో లేకపోవడంతో పీవో సిబ్బంది వద్ద పలు వివరాలు సేకరించారు. వైద్యాధికారి నిర్లక్ష్య వైఖరిని పీవోకు లాగరాయి సర్పంచ్ మిరియాల గణలక్ష్మి వివరించారు. తాను, ఎంపీపీ ఆసుపత్రికి వెళ్లి వైద్యాధికారిని ప్రశ్నిస్తే మీకు ఆ హక్కు లేదని ఆయన తమతో వాగ్వాదానికి దిగారని చెప్పారు. దీంతో పీవో సింహాచలం స్పందిస్తూ వైద్యాధికారిని తక్షణం సస్పెండ్ చేయాలని ఏడీఎంహెచ్‌వోను ఆదేశించారు.

కొడవలిపై తవ్వకాలు నిలిపివేత

కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలు


కొడవలిలో కొండను పరిశీలిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ

గొల్లప్రోలు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలిలోని సర్వే నెం.133/1లోని కొండ పోరంబోకు (తురకల కొండ) భూముల్లో గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ ఆదేశించారు. బౌద్ధ ఆరామాలు కలిగిన ఈ కొండపై ఏపీ పొల్యూషనల్ కంట్రోల్ బోర్డు నిబంధనలు, ఇతర ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారని, మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వైసీపీకి చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, గత ఎన్నికల్లో చిత్తూరు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తికి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన లీజులు ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. గతంలో లీజుల రద్దుకు వ్యతిరేకంగా టీడీపీ, ఇతర పార్టీలు పోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేశారు.ఈ నేపథ్యం లో తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కొడవలి కొండపై ఎటువంటి తవ్వకాలు, కార్యకలాపాలు చేపట్టవద్దని కలెక్టర్ ఆదేశించారు.దీంతో కొండపై జరిగిన తవ్వకాలను తహశీల్దారు సత్యనారాయణ, మైనింగ్ సర్వేయర్ శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్ తేజు గురువారం పరిశీలించారు. తవ్వకాలు జరిపిన ప్రదేశాలను తనిఖీ చేశారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి: ఏసీ ప్రసాద్


ఆర్డీవోకు చిత్రపటం అందజేస్తున్న ఏసీ ప్రసాద్

అంతర్వేది, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ గురువారం అమలాపురం ఆర్డీవో కె.మాధవిని మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామివారి చిత్రపటాన్ని ఆమెకు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్డీవో మాధవిని ఏసీ ప్రసాద్ కోరారు. సూపరింటెండెంట్ విజయసారథి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుడా వైస్ చైర్మన్‌గా జేసీకి అదనపు బాధ్యతలు



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం అర్బన్ డవలప్మెంట్ అథారిటీ(రుడా) వైస్ చైర్మన్‌గా తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన అదనపు బాధ్యతలు స్వీకరించారు. రుడా వైస్ చైర్మన్‌గా పనిచేసిన కేతన్ గార్గ్ గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ కమిషనర్ నియమితులై బదిలీ కావడంతో జేసీకి అదన పు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. బాధ్యతలు స్వీకరించిన ఆయన రుడా సెక్రటరీ ఎంవీఆర్ సాయిబాబా, చీఫ్ ప్లా నింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఈఈ జి.నాగేశ్వరరావు, ఇతర అధికారులతో రుడా చేపట్టిన అభివృద్ధి అంశాలపై చర్చించారు.

యువకుడి అదృశ్యం

సామర్లకోట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన నొక్కు కిరణ్‌కార్తీక్ ఇంటర్ వరకు చదివాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగా రాలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందన్నారు. కార్తీక్ తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో జూలై 7, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. ఒకవేళ రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

ఋణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: అద్దంకి	
758462001937	కేశనపల్లి అభినవ్
758462001958	కేశనపల్లి అభినవ్
758462002318	కేశనపల్లి అభినవ్
758462002407	కేశనపల్లి అభినవ్
758462002181	దర్శి శామ్యూల్
శాఖ పేరు: అమలాపురం	
044162010261	గూడపల్లి నాగేంద్ర
శాఖ పేరు: కడప	
067462014451	ప్రదీప్ వి
067462014433	ఆర్‌వి శేషాంజనేయ కుమార్
శాఖ పేరు: దర్శి	
782962000447	వీరంరెడ్డి మల్లికార్జునరెడ్డి
శాఖ పేరు: ధర్మవరం	
103462015817	పి. జయరాం
103462015642	పి. జయరాం
శాఖ పేరు: డోన్	
794962000373	రాగిమాను కమలాకర్
శాఖ పేరు: గుంటూరు	
630762031704	కున్నా బాల రవితేజ
630757016619	త్రివేణి ఎన్.
శాఖ పేరు: గుంటూరు - పొన్నూరు రోడ్	
532357000004	మహ్మద్ జమీల్
శాఖ పేరు: హిందూపూర్	
067262006662	జి. అశోక్ కుమార్
067262006427	మహ్మద్ ఇమ్రాన్
శాఖ పేరు: జల్లకల్లు	
307462001017	జిరవల్లి వెంకటరెడ్డి
శాఖ పేరు: కదిరి	

ఋణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
395462003849	వడ్డిరెడ్డి వెంకట రమణారెడ్డి
395462003973	వడ్డిరెడ్డి వెంకట రమణారెడ్డి
శాఖ పేరు: కాకినాడ	
028062008777	బత్తుల రాజ్ ప్రదీప్
శాఖ పేరు: కల్లూరి	
306962000540	[illegible]
శాఖ పేరు: కనిగిరి	
069862018298	ప్రదీప్ షేక్
069862018504	ప్రదీప్ షేక్
శాఖ పేరు: కానూరు	
530062000096	ముమ్మడిశెట్టి కుటుంబ శాస్త్రులు
530062000132	ముగడ ఉమా మహేష్
శాఖ పేరు: కర్నూలు	
027962019414	పల్లె మురళీధర్
027962019891	కనుగుల కిరణ్ కుమార్
శాఖ పేరు: నెల్లూరు	
631062023153	బోర ప్రసాద్
631062023415	బోర ప్రసాద్
శాఖ పేరు: నూజివీడు	
198262006478	వెలివెల నాగరాజా
198262006481	వెలివెల నాగరాజా
శాఖ పేరు: పుత్తూరు-ఆంధ్రప్రదేశ్	
200462006675	టి. వినోద్ కుమార్
శాఖ పేరు: రాజమండ్రి	
631557003633	పారిపెల్లి సుందర ఆదిత్య
శాఖ పేరు: సత్తెనపల్లి	
285362000777	చింతపల్లి అక్రం
శాఖ పేరు: తుని	
197962012695	మల్లిడి నరేంద్ర రెడ్డి
శాఖ పేరు: విశాఖపట్నం - మధురవాడ	
240562001601	నాగల లావణ్య

ఋణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: విశాఖపట్నం - కూర్మన్నపాలెం	
437957000021	పత్సవాయి వెంకట రామరాజు
శాఖ పేరు: [illegible]	
460062000020	పెంకి పుల్లారావు
శాఖ పేరు: బెరహంపూర్ - మెడికల్ కాలేజ్ రోడ్	
149757000103	తున్న బరత్ మండల్
శాఖ పేరు: హైదరాబాద్ - ఇమేజ్ గార్డెన్స్	
720362000624	ఆటూరు కుమారి
శాఖ పేరు: హైదరాబాద్ - రామంతాపూర్	
412262000687	సూరజ్ సయ్యద్
శాఖ పేరు: హైదరాబాద్ - కూకట్‌పల్లి	
631262037231	గోగిరెడ్డి శివశంకర రెడ్డి
శాఖ పేరు: [illegible]	
222262001574	బొడ్డు బాలరాజు
శాఖ పేరు: కూకట్‌పల్లి - నిజాంపేట్	
180562004083	ఎ. వెంకట రమణ శాస్త్రి
శాఖ పేరు: పర్లకిమిడి	
063862008071	మీసాల జ్ఞానేశ్వరరావు
శాఖ పేరు: పూనె - జౌండ్ నగర్‌దాస్ రోడ్	
187862002140	వేలూరి జనార్దన్ రెడ్డి
187862002349	వేలూరి జనార్దన్ రెడ్డి
శాఖ పేరు: షాద్‌నగర్	
379962005776	రవి కుమార్
శాఖ పేరు: షోలింగూర్	
761662002588	సుధాకర్ వి
761662002589	సుధాకర్ వి
761662002590	సుధాకర్ వి
శాఖ పేరు: తిరునల్వేలి జంక్షన్	
613562028207	ఉమ్మిడి అప్పల రాజు

తేది : 27.06.2025
ప్రదేశం: బాపట్ల, గుంటూరు, కాకినాడ, డా. బి.ఆర్ అంబేద్కర్‌కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణ, కర్నూలు, నంద్యాల, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్య సాయి, తిరుపతి, విశాఖపట్నం, వై.ఎస్.ఆర్, ఇచ్ఛాపురం, కడప, నెల్లూరు, మహబూబ్‌నగర్, హైదరాబాద్, శ్రీకాకుళం, ప్రకాశం, రంగారెడ్డి, చిత్తూరు, విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున

వారాహి అమ్మవారికి పూజలు

అంబాజీపేట, జూన్26(ఆంధ్రజ్యోతి): మాచవరంలోని పార్వతీ రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉన్న వారాహిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


పి.గన్నవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, విద్యార్థులు

డ్రగ్స్‌కు బానిసలై కుటుంబాలను
చిన్నాభిన్నం చేసుకోవద్దు

• డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు బానిసలై కుటుంబాలను చిన్నభిన్నం చేసుకోవద్దని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి యువత డ్రగ్స్‌కు బానిసై తమ తల్లిదండ్రులను సైతం కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఉన్నత విద్యలను అభ్యసించి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు. డ్రగ్స్ వాడకం, విక్రయాలు తదితర సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తొలుత స్థానిక పాఠశాలలు, కళాశాలలు నుంచి అధికసంఖ్యలో విచ్చేసిన విద్యార్థులు రేపటి తరం కోసం గంజాయి రహిత సమాజాన్ని స్థాపిద్దాం, గంజాయి వద్దు గౌరవంగా బతుకుదాం అంటూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ర్యాలీని ప్రారంభించగా త్రీరోడ్ సెంటర్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శ్రీపల్లవి, నియోజవకర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎస్ఐలు బి.శివకృష్ణ, హరికోటిశాస్త్రీ, చెతన్యకుమార్, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, ఆదిమూలం సూరయ్య కాపు, అన్నాబత్తుల హనుమాన్, ప్రసన్నకు మార్, కార్యదర్శులు,వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి రహిత సమాజం కోసం దీక్ష

ముమ్మిడివరం: రేపటితరం కోసం.. గంజాయి రహిత సమాజం ఇదే మా దీక్ష-డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని ముమ్మిడివరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం సాయంత్రం కూటమి నాయకులతో కలిసి పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు స్టేషన్ వద్ద నుంచి కాశివానితూము సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. భారీగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో సంపూర్ణంగా మత్తు పదార్థాలను సమాజం నుంచి తరిమి వేయడానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, నాయకులు గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, ములపర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, నడింపల్లి శ్రీనివాసరాజు, కురసాల శివ, ఉంగరాల వెంకటేశ్వరరావు, మెండి కమల, కాశి లాజర్, నీతిపూడి వంశీ, ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్, ఐ.పోలవరం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు, కాట్రేనికోన ఎస్ఐ అవినాష్, బి.శ్రీగణిత, ఎం.గంగాభవానీ, కె.రామ్‌కుమార్, ఎస్.శేషుబాబు, ఎక్సైజ్‌శాఖ అధికారులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అమలాపురంటౌన్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజల్లో ఒక్కరైనా విద్యార్థులు సైతం భాగస్వాములు కావాలని అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు పిలుపునిచ్చారు. అమలాపురం మిరియం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు అధ్యక్షతన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌బాబు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించడం వల్ల వ్యక్తిత్వ మనోవికాసాభివృద్ధికి అవరోధం కలుగుతుందన్నారు. ప్యానల్ లాయర్ వెంపరాల భాస్కరశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా పనిచేయాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులచే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ, హెచ్‌సీలు పెట్టా సత్యనారాయణ, భద్రరావు, కె.నాగేంద్రకుమార్, సీహెచ్ నాగేశ్వరరావు, కానిస్టేబుళ్లు జె.నానాజీ, ఎస్.బాలాజీ, ఇ.పవన్‌కుమార్, ప్యానల్ లాయర్ కముజు వీవీ శ్రీనివాసరావు, ఆరుమల్లి వాణి తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్ ఛిద్రం

రాజోలు: మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్‌ను ఛిద్రం చేస్తున్నాయని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రగ్‌రహిత ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం అనే నినాదంతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ప్రాణాలను కాపాడుకుందాం అనే నినాదంతో రాజోలు ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏవో ఎంవీ సత్యనారాయణ, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, వైద్యులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఆటో యూనియన్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం మోరి హైస్కూలులో జిల్లా కమ్యూనిటీ మొబిలిటి ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీసుల ఆధ్వర్యంలో డీఐజీ గోపీనాథ్‌శెట్టి ఆదేశాల మేరకు అంతర్వేది మెరైన్ సీఐ అల్లు నవీన్‌నరసింహంమూర్తి పర్యవేక్షణలో మత్తు పదార్థాల వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.


ముమ్మిడివరం: అన్న క్యాంటీన్‌లో బాలుడు భోజనం చేస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవివర్మ


ఉప్పలగుప్తం: పెదపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడుతున్న డీఈవో సలీం బాషా

సకల వసతులతో సర్కారు బడి

• డీఈవో షేక్ సలీంబాషా

ఉప్పలగుప్తం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనకు సకల వసతులు కల్పిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా అన్నారు. గురువారం ఆయన ఎస్.యానాంలోని ఉన్నత పాఠశాలతోపాటు గ్రామంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు మధ్యాహ్న భోజనం బాగుందా? అని విద్యార్థులను ఆరా తీశారు. అంతకు ముందు భీమనపల్లి, గోపవరం, చల్లపల్లి ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. గొల్లవిల్లి హైస్కూల్లో అన్ని తరగతులను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఏర్పాట్లు, తరగతి గదుల్లో వసతులపై ఆయన హెచ్‌ఎం జి.కనకదుర్గను ప్రశంసించారు. ఉద్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులహాజరు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్యకృష్ణ పాల్గొన్నారు.

భోజనానికి వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలి

• నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ

ముమ్మిడివరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ భోజనం చేసే వారితో మాట్లాడారు. వసతులు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల కోసం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలన్నారు. భోజనానికి వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించి వారికి ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మంచినీరు అందించడంలోను, భోజనానికి సంబంధించిన ప్లేట్లు అందించడంలోను పూర్తి పరిశుభ్రతను పాటించాలని వారికి సూచించారు. అక్కడకు భోజనానికి వచ్చిన ఓ కుటుంబంలోని బాలుడిని ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయని, అక్కడి సిబ్బంది తీరును అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రతిపక్షాలు ఆత్మవిమర్శ చేసుకోవాలి: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పుల సుడిగుండంలో ముంచి అభివృద్ధి ఊసెత్తని ఆనాటి పాలకులు నేడు విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు వారిని ఎందుకు ఇంటికి పంపారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో హక్కులను అధిగమిస్తూ ఒక పక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధిని ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాలని తప్ప సమాజాన్ని పాడుచేసే ప్రకటనలు చేయడం తగునా అని అన్నారు. నియోజకవర్గంలో 10వేల ఎకరాలను సాగులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

'సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేయాలి'

మామిడికుదురు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సిబ్బంది ప్రతీఒక్కరూ సంపూర్ణ పారిశుధ్యమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి కోరారు. డీపీవో గురువారం ఈదరాడ, పాశర్లపూడి గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి-పొడి చెత్తల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవోతో పాటు ఈవోపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్కే. రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత గంగయ్య


గంగయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ, తదితరులు

మలికిపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య అని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం గంగయ్య వర్ధంతి సందర్భంగా ఆచంటలో ఆయన నిలువెత్తు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గంగయ్య ముందుచూపు ఉన్న వ్యక్తి అని ఆయన హయాంలో విద్యాభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. అదేవిధంగా రోడ్లు, వంతెనలు, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. అభివృద్ధికి చిరునామా గంగయ్య అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, మంగెన భూదేవి, మంగెన రాధాకృష్ణ, సూరిశెట్టి శ్రీనివాస్, సాయి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, బొంతు ఉమారావు పాల్గొన్నారు.

షియా ముస్లింల సంతాప దినాలు ప్రారంభం

అమలాపురం టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): షియా ముస్లింల ఆరాధ్య దైవదూత మహ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్‌హుస్సేన్‌ను, అతని అనుచరులను కర్బలా ఏడాదిలో అతి క్రూరంగా వధించిన రోజులను పురస్కరించుకుని అమలాపురం 12వ వార్డు ముజాఫర్ సందులో అబ్బాషియా పంజా వద్దకు షియా ముస్లింలు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం నెలవంక చూసిన తరువాత మొహర్రం నెల షియా ముస్లింలకు శోకతప్త హృదయాలతో ప్రారంభమైంది. జూలై 10న ఆహార పానీయాలు ముట్టకుండా అత్యంత భక్తి శ్రద్ధలతో నిష్ఠగా ఉపవాసం చేస్తారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన మత గురువు అబ్బల్ హుస్సేన్ కర్బలాలో జరిగిన ముఖ్య ఘట్టాన్ని వివరించగా కన్నీటి పర్యంతమయ్యారు. పంజా ధర్మకర్త మహ్మద్ నిస్సార్ హుస్సేన్, కార్యదర్శి కరార్‌హుస్సేన్, మొహమ్మద్ చాంద్‌బాషా, అబ్బాస్, అమీర్, కర్రార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కుచట్టంపై సమావేశం ఏర్పాటుచేయాలి

ముమ్మిడివరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థలపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఆరోపణలపై విద్యాసంస్థల ప్రతినిధులు తల్లిదండ్రులతో అవగాహన సదస్సును ఏర్పాటుచేయాలని కోనసీమ జిల్లా కన్స్యూమర్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. కోనసీమ వినియోగదారుల సంఘాల ఫెడరేషన్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్యకిరణ్‌లతో కూడిన బృందం గురువారం ముమ్మిడివరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, డీఎస్వో కార్యాలయంలో వారు మెమోరాండంను అందించారు. డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు, డీఎస్వో ఎ.ఉదయభాస్కర్‌కు వారు వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం బాలయోగి ఘాట్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఏరియా ఆసుపత్రి ఫీడర్ ట్రీ కటింగ్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. దుడ్డువారి అగ్రహారం ముమ్మిడివరం గేటు నుంచి నల్లవంతెన, మెయిన్‌రోడ్డు, రవణంమల్లయ్యవీధి, షాదీఖానా ఏరియా, ఎన్టీఆర్‌మార్గ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంబాజీపేట: విద్యుత్ మరమ్మతుల పనులలో భాగంగా అంబాజీపేట, గంగలకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలోఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, పోతాయిలంక, సాకుర్రు, గున్నేపల్లి, గంగలకుర్రు, కె.పెదపూడి, మొసలపల్లి, అమలాపురం రూరల్ మండల పరిధిలోగల పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యానాంలో నియోజవర్గంలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనుందని ఏఈ ఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో కాకినాడ 132కేవీ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నిర్వహణ కారణంగా అంతరాయం కలుగనుందన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యానాం నియోజవర్గంలోని మున్సిపల్ ఉద్యోగులు గత కొంతకాలంగా ప్రభుత్వం వేతనాలు అందించకపోవడంతో ఆందోళన చేశారు. యానాం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి పరిపాలనాధికారి కార్యాలయంనకు చేరుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే స్పందించి ప్రత్యేక ప్యాకేజ్‌ను కేటాయించాలని వారు కోరారు. విశ్రాంతి ఉద్యోగులకు బకాయి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులతో పాటు విశ్రాంతి ఉద్యోగులు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఈడబ్ల్యుఎస్‌పై అవగాహన కల్పించాలి

యానాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యానాంలో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌పై ప్రజలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలని అన్నాడీఎంకె యానాంశాఖ కార్యదర్శి మంచల సత్యసాయి కుమార్ కోరారు. ఈమేరకు యానాం పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. పుదుచ్చేరి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలలో కేంద్రప్రభుత్వం నిబంధనల మేరకు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నారు.

హోంమంత్రితో ఎమ్మెల్యే గొల్లపల్లి భేటీ

యానాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి హోంమంత్రి నమ్మశివాయతో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భేటీ అయ్యారు. యానాంకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. అక్షయపాత్ర ద్వారా పౌష్టికాహారం ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం అందిస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని వచ్చేనెలలో పుదుచ్చేరిలో ఏవిధంగా అమలు చేస్తున్నారో యానాంలో కూడా అమలుచేయాలని కోరారు. విద్యాశాఖలో పనిచేస్తున్న గెస్ట్, పారా టీచర్స్‌లకు సంబంధిం హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

అమలాపురం టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పశువులను విచ్చలవిడిగా రోడ్లపై విడిచిపెడితే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ హెచ్చరించారు. పట్టణ పరిధిలో ఆవులు, ఇతర పశువులను పెంచే యజమానులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పశువులను రోడ్లపై విచ్చలవిడిగా వదలడంవల్ల రహదారులపై ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. వీటివల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఒక్కో సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పశువులను రహదారులపై విడిచిపెట్టడం చట్టవిరుద్ధమన్నారు. యజమానులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆనందరావు జన్మదిన వేడుకలు


చల్లపల్లిలో ఎమ్మెల్యే ఆనందరావు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, తదితరులు

ఉప్పలగుప్తం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలను గురువారం గ్రామగ్రామాన కూటమి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ పెదగాడవిల్లి, చినగాడవిల్లి, గొల్లవిల్లి గ్రామాల్లో పాల్గొని జన్మదిన కేక్‌ను కట్ చేశారు. టి.చల్లపల్లిలో గ్రామకమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, దంగేటి బాబులు, దంగేటి రవీంద్రనాథ్, బూసి బుజ్జిదొర, పోలిశెట్టి రామకృష్ణారావు, కొల్లు శ్రీనివాసరావు, పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, సుంకర రాంబాబు, గొలకోటి రాంబాబు, ఎన్ లక్ష్మణ పేరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో కంకటాల రామం, దేశంశెట్టి నాగరత్నకుమారి, చీకట్ల ఏసు, మద్దింశెట్టి సీతారామస్వామి, అడబాల సత్యనారాయణ, గుత్తాల సుభాష్‌చంద్రరావు, నల్లా సత్యనారాయణ, గొలకోటి సత్తిరాజు, చప్పిడి వెంకటేశ్వరరావు(కిరణ్), నిమ్మకాయల రాము, లంకే శ్రీనివాస్, చప్పిడి వెంకటనాగేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు,గుత్తుల శ్రీనివాస్, మల్లాడి వెంకటరమణ, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, ఆకుల వెంకటరమణ, అయితాబత్తుల వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పుట్టినరోజు వేడుకలను గురువారం అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అమలాపురంలోని మెట్ల స్వగృహం వద్ద ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, టీడీపీ నాయకులు నల్లా స్వామి, కర్రి దత్తుడు, గంధం పల్లంరాజు, మెట్ల సత్య, అయితాబత్తుల కరణ్, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా మల్లిబాబు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఏరియాఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అన్న క్యాంటీన్‌లో కరణ్ సహకారంతో ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా భోజనాలు ఏర్పాటుచేశారు. హరిమనోవికాస కేంద్రంలో కూడా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఇంటివద్ద కొందరికి వస్త్రాలు పంపిణీ చేశారు.

పోలేరమ్మకు తీపి కావిడి

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సమనసకు చెందిన జనసేన నాయకుడు మామిళ్లపల్లి దొరబాబు ఆధ్వర్యంలో గురువారం గ్రామదేవత పోలేరమ్మకు 150 కిలోల స్వీట్లతో తీపికావిడి సమర్పించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు నడింపల్లి ఉదయబాబు, పాలాటి బాలయోగితోపాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అమలాపురంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల కేక్ కట్‌చేసిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పోలేరమ్మకు తీపి కావిడి సమర్పిస్తున్న దృశ్యం

మహిళ అదృశ్యం

అంతర్వేది, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన బొడ్డు లక్ష్మీసరోజిని (67) 24వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని కుమారుడు బొడ్డు కుమార్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెండు రోజులుగా గొంది సఖినేటిపల్లి మండల పరిసర ప్రాంతాల్లో తల్లి సరోజిని కోసం వెతకగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

• ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా డ్రగ్స్ మాఫియా కోసం వెళ్లిన ఆలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ బెల్సన్‌లు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సంతాప కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఎస్.ఐ, కానిస్టేబుల్ చిత్రపటాలకు ఎమ్మెల్యే సీఐ రుద్రరాజు భీమరాజు, స్థానిక నాయకులతో కలిసి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, నాయకులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎస్ఐలు బి.శివకృష్ణ, హరికోటి శాస్త్రీ, చెతన్యకుమార్, నియోజవకర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, తాటికాయల శ్రీనివాసరావు, అన్నాబత్తుల హనుమాన్, సీహెచ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ బెల్సన్‌ల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, సీఐ

ఉపాధ్యాయులకు సత్కారం

అయినవిల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన గురువారం వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ముక్తేశ్వరంలో గత కొంత కాలంగా పనిచేసిన ఉపాధ్యాయులు ఆర్.భాస్కరరావు, జి.వెంకటేశ్వరరావు, జి.రత్నకుమారి, ఎస్.నాగేశ్వరరావు, వీవీఎస్వీడీ భవానీ, కె.సిద్ధార్థప్రసాద్, జి.ఏసుకుమారిలు వేర్వేరు పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. వీరందరినీ గ్రామస్తులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల అభివృద్ధి నిమిత్తం ఉపాధ్యాయులు రూ.25వేలు అందజేశారు. పాఠశాలలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తొమ్మిది మంది ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఎస్. సత్యనారాయణ, వై.ఫణికుమార్, జి.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా తులసీకృష్ణ

ఉప్పలగుప్తం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం ఇన్‌చార్జి ఎంపీడీవోగా భూపతిరాజు తులసీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాలనాధికారిగా ఉన్న ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. మండల ఇంజనీరింగు అధికారి రాధాకృష్ణ, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, ఉపాధి ఏపీవో వీరబాబు, కార్యాలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

వైభవంగా రుద్రహోమం

ఐ.పోలవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీ సమేతవీరేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాస ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గురువారం స్వామికి రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బకింగ్‌చంద్ర చటర్జీ జయంతి


అమలాపురం టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ గీతాన్ని రచించిన బంకింగ్‌చంద్ర చటర్జీ జయంతిని అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వందేమాతరం జాతీయగీతాన్ని ఆలపించారు. సంస్కార భారతి మాతృశక్తి సంయోజకులు వేదనభట్ల సాయిలక్ష్మి, వేదనభట్ల కళాపూర్ణారావులు వాకర్స్ క్లబ్ సభ్యులచే గీతాలాపన చేయించారు. ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, కోశాధికారి పడాల నాయుడు, జిల్లా పీఆర్వో యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, జిల్లా బులెటిన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్, వలవల వెంకటరెడ్డి నాయుడు, ఇవటూరి రవిసుబ్రహ్మణ్యం, గుర్రం రామకృష్ణ, తేతేల సత్యనారాయణరెడ్డి, కూచిమంచి కృష్ణ పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

అమలాపురంరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నవరప్పాలెంలో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యమస్ఫూర్తితో రాజ్యాధికారంవైపు అడుగులు వేయాలి

• సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మధు


సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

ముమ్మిడివరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీని బలోపేతంచేసి రాజ్యాధికారంవైపు అడుగులు వేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. గురువారం ముమ్మిడివరం సీపీఐ కార్యాలయంవద్ద సీపీఐ ముమ్మిడివరం నియోజకవర్గ 17వ మహాసభను వనచర్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీపీఐ జెండాను పలివెల రాంబాబు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మధు మాట్లాడుతూ 1925లో కాన్పూర్‌లో ఏర్పాటైన సీపీఐ పార్టీ స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి అందించి నేడు వందో సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. దేశంలో బ్రిటీష్ అధికారం తొలగిపోయి భారతీయులకు కేవలం అధికారం రావాలని మాత్రమే కాంగ్రెస్‌పార్టీ స్వార్థపూర్వక ఉద్యమం నిర్వహించిందని, కమ్యూనిస్టు పార్టీ మాత్రం దేశ ప్రజల హక్కుల కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం, వారి భవిష్యత్ కోసం స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ స్వార్థపూరితంగానే స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టులబలిదానాలు, త్యాగలను పాఠ్యాంశాలను చేర్చకుండా చరిత్రను వక్రీకరించి చూపించిందన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నల్లధనాన్ని బయటికి తీస్తామని చెప్పి నల్లధనాన్ని మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థకు తరలించారని ఆరోపించారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ జూలై 19, 20 తేదీల్లో జరిగే జిల్లా మమహాభలు అమలాపురంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే 26 జిల్లాల్లో మహాసభలు పూర్తయిన తరువాత ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలు నగరంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో మహాసభలు పూర్తయిన తరువాత సెప్టెంబరు నెలలో జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్టు సత్తిబాబు పేర్కొన్నారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ మహిళాసంఘ కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షురాలిగా శీలం గౌరీపార్వతి, ఉపాధ్యక్షురాలిగా పలివెల నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా యనమదల నిరోషా, సహాయ కార్యదర్శిగా రేవు వెంకటలక్ష్మి, కోశాధికారిగా బూరగ సీతారత్నంలతోపాటు మరో ఏడుగురితో కమిటీ ఏర్పాటైంది. కార్యక్రమంలో శీలం వెంకటేష్, సానబోయిన మనోహర్, పలివెల నాగలక్ష్మి, దొమ్మేటి వీరంశెట్టి, రేవు వెంకటలక్ష్మి, బి.లోవరాజు, సత్యనారాయణరాజు, వై.అరుణ, వి.కుమారిలతో పాటు మనోహర్, అరుణ, నిరోషా, నాగలక్ష్మి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.66 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నేను ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,66,741 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ర్యాలిలో నట్టల నివారణ వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి వెంకట్రావు

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్

ఆత్రేయపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్ అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కె.వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం ర్యాలిలో గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ నెల 26 నుంచి వచ్చే 10వ తేదీ వరకూ 15 రోజులపాటు దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలి గ్రామంలో 250 గొర్రెలు, మేకలను గుర్తించి నట్టల నివారణ వ్యాక్సిన్ అందిస్తున్నామన్నారు. పశువుల ఆసుపత్రిలో మండల సైతం సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, పశువైద్యాధికారిణి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

కపిలేశ్వరపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలేరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామ సర్పంచ్ డికావేరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనాన్ని ఆమె రుచి చూశారు. తెలుగు పాఠశాలలో విద్యార్థుల తరగతి గదుల్లో వారికి అందిస్తున్న విద్యాబోధనపై ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బి.సంధ్యారాణి, వైస్ చైర్మన్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న సర్పంచ్ కావేరి

బడిఈడు చిన్నారులను బడిలో చేర్పించాలి

రాయవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బడిఈడు చిన్నారులంతా బడిలో ఉండాలని ఇందుకోసం నిర్వహిస్తున్న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ వచ్చేనెల 12 వరకు కొనసాగుతుందని సమగ్ర శిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు తెలిపారు. గురువారం వెదురుపాక మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించిన ప్రతి విద్యార్థి తరగతుల వారీగా విద్యా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వచ్చేనెల 5న నిర్వహించే పేరెంట్, టీచర్స్ మీటింగ్ 2.0 లో తల్లిదండ్రులను మోటివేట్ చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సంయుక్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని ఏఎంవో పిలుపునిచ్చారు. అనంతరం ఏఎంవో విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంటూరు అప్పారావు, రాయవరపు భాస్కర్, బొట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వెదురుపాకలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఏఎంవో రాంబాబు

ఉండమట్ల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ



కేశవరంలో ఉండమట్ల రామారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేశవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, సహకార సంఘ అధ్యక్షుడు ఉండమట్ల రామారావు మరణం గ్రామానికి తీరని లోటని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, ఎంపీటీ ఉండమట్ల వాసు ఉండమట్ల సురేష్, సత్యనారాయణ, కూను సత్యనారాయణ తదితరులు ఉన్నారు. పట్టణానికి చెందిన గొల్లపల్లి లత, పాలచర్ల కిట్టయ్య, దొడ్డిపట్ల సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రావులపాలెం డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రావులపాలెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిషన్ గ్రీన్ ప్లాంట్ స్వచ్ఛత సంస్థ నిర్వాహకులు ఎం.కిషోర్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎన్.అరుణకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ వృక్ష పదార్థాల నిషేధం అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సామాజిక సేవా నిర్వాహకులు చిన్నం తేజరెడ్డి పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెట్లను పెంచడం ద్వారా పర్యావరణం పరిరక్షించబడుతుందని పాటు భూమి రక్షించబడుతుందన్నారు. కళాశాల ప్రాంగణంలో పలు రకాల పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.సుబ్బలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, బీవీఎస్ రెడ్డి, రజని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాలు వేస్తున్నా పట్టించుకోరా?

• వాహనదారులు, గ్రామస్థుల ధ్వజం • బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

రావులపాలెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తా, చెదారాలతో పాటు పాత ఇళ్ల నుంచి వచ్చిన సామగ్రిని ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన పడేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను కూడా రోడ్డు పక్కన వదిలివేస్తుండటంతో ఆయా రహదారుల్లో ప్రయాణించాలంటే ముక్కు మూసుకోవల్సి వస్తోందని వాహనదారులంటున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లోని వ్యర్థాలన్నీ తెచ్చి రహదారులు, కాలువగట్లు పక్కన పడవేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆయా ప్రాంత గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రావులపాడు వంతెన వద్ద నుంచి వెదిరేశ్వరం గ్రామంలోకి వెళ్లే రహదారులు కాలువ గట్టు చెంతనే వ్యర్థాలు, ఇతర సామగ్రిని పడేస్తుండటంతో వాటి నుంచి వచ్చే వాసన భరించలేక పోతున్నామంటూ ఆయా ప్రాంత గ్రామ స్థులు వాపోతున్నారు. పొడగట్లపల్లి శివారు ప్రాంతంలో రహదారి చెంతనే గ్రామంలోని వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాలను పడవేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు ఇదే తరహా లో ప్రధాన పంట కాలువలు, పిల్ల కాలువ చెంతన సైతం వ్యర్థాలను పడవేస్తుండటంతో దుర్గంధాన్ని భరించలేక పోతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపక్కన వ్యర్థాలను పడేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.



వెదిరేశ్వరం కాలువగట్టు చెంతనే పడేసిన వ్యర్థాలు



కొత్తపేటలో విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ అధికారులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అశువులు బాసిన పోలీస్ అధికారులకు నివాళులు

కొత్తపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేదాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశువులు బాసిన అలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ జీవన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది, గ్రామస్థులు ఈ మరణపై విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల బాబ్జి, కంఠంరెడ్డి శ్రీనివాస్, విశ్వ మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ మృతిపట్ల మంత్రి సంతాపం

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): కేదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ జీవన్ మృతి చెందడం పట్ల మంత్రి సుభాష్ విచారం వ్యక్తం చేశారు. వారి మృతి పట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే బండారు సంతాపం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కేదాడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన అలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ జీవన్ మృతదేహాలకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాళులర్పించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఘటనా స్థలానికి బయలుదేరగా మార్గమధ్యంలో మృతదేహాలను తీసుకు వస్తున్న వాహనం ఎదురుకావడంతో దాని ఆపి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

ఎమ్మెల్యే వేగుళ్ల సంతాపం

మండపేట, (ఆంధ్రజ్యోతి): కేదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ దుర్మరణం బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఎస్ఐ అశోక్ మండపేట ఎస్ఐగా పనిచేసిన సమయంలో ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ మృతిపట్ల ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.



సతీష్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందచేస్తున్న మంత్రి సుభాష్

మంత్రి సుభాష్ ఆర్థికసాయం

ద్రాక్షారామ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామానికి చెందిన ఒక కుటుంబానికి మంత్రి సుభాష్ గురువారం రూ.20 వేలు ఆర్థికసాయం అందచేశారు. ఏరుపల్లికి చెందిన చవకల సతీష్ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో ఇది తెలుసుకున్న మంత్రి బాధిత కుటుంబానికి రూ.20 వేల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిల్లా గోపాలకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రామన్‌కు సత్కారం

ఆత్రేయపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఎంపీడీవో వెంకటరామన్‌ను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ఈ నెల 25న కలెక్టర్ కార్యాలయంలో యోగాంధ్ర విజయవంతం సభ నిర్వహించారు. ఈ నెల 16న ఎవ్వపల్లిలో జిల్లాస్థాయి యోగాంధ్ర విజయవంతంగా నిర్వహించినందుకు ఎంపీడీవో వెంకటరామన్‌ను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి ఉత్తమ ఎంపీడీవోగా ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు సత్కరించారు.



నివాళులర్పిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు





అలమూరులో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో కె.గంగవరం పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ దృశ్యం

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

అలమూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కుంట్రిగపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలమూరుకు చెందిన రావాడ నరేష్ ఆర్థికసాయంతో కొనుగోలు చేసిన పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని అలమూరు ఎంఈవో బి.అప్పాజీ, దాత రావాడ నరేష్, పాఠశాల హెచ్ఎం అద్దరి శ్రీనివాసరావుల చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ అరవా లక్ష్మి, కమిటీ సభ్యులు, గోళ్ళకృష్ణ కిరణ్, సీఆర్ఎంటీ జ్యోతి, ఉపాధ్యాయులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): గంగవరం మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం దాతల సమకూర్చిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముత్యాల కిషోర్, సద్ర దంపతులు వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్ఏ ఐఈ కోఆర్డినేటర్ మల్లిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు దాసరి శ్రీను, మాగాపు ప్రదీప్‌కుమార్, ఎన్.శ్యామలాదేవి, కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.



లొల్లలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

రాయవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల ఎంపీయూపీ స్కూల్‌లో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం సత్కరించారు. హెచ్ఎం శ్యామ్యూల్ జోసఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి జానకి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలో హెచ్ఎంగా పని చేసిన కొప్పుల నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు దండు రాంబాబు సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు నాగిరెడ్డి, రాంబాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అప్పారావు, రాంబాబు, వీర్రాజు, టీడీపీ నాయకుడు సుంకవల్లి గంగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రికా, కృష్ణవేణి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, విద్యార్థులు, అధికారులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మండపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండపేటలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ర్యాలీలో వివరించారు. పట్టణ సీఐ సురేష్, ఎస్ఐ వంటిల సారథ్యంలో జరిగిన ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మండవల్లి దొరబాబు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ సంఘం మండల అధ్యక్షుడిగా గంధం

కొత్తపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా గంధం నాగశ్రీరామ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పాలంగి శ్రీను, కార్యదర్శిగా దూనబోయిన శ్రీను, కోశాధికారిగా యాండ్ర శివరామ్‌కుమార్ సభ్యులుగా మువ్వాదేవరపు రాజశేఖర్, కొత్తసాయిసుబ్రహ్మణ్యం, పట్టా రాజులు ఎన్నికయ్యారు. వీరిని జిల్లా గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి రామరెడ్డి, అధ్యక్షుడు గెద్దం సురేష్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో దొరబాబు, యిలిశెట్టి ప్రభాకర్, నామాల శ్రీను, కె.బంగర్రాజు, కొప్పిశెట్టి శివకుమార్, బి.వీరకొండలు, గాంధీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ మండల అసోసియేషన్

కోడిపందాలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

అమలాపురం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సవరప్పాలెంలో కోడిపందాలు ఆడుతున్నట్టు సమాచారంతో ఎస్ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మహిళ అదృశ్యం

ఆత్రేయపురం(?), జూన్ 26(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన బొడ్డు లక్ష్మీసరోజిని (67) 24వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని కుమారుడు బొడ్డు కుమార్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పరిసర ప్రాంతాల్లో తల్లి సరోజిని కోసం వెతకగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఏ.దుర్గాశ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు తాగునీరు సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణానికి తాగునీటి సరఫరా చేసే వెల్ల హెడ్ వాటర్‌వర్క్స్‌లో వ్యాక్యూమ్ మోటార్లను మరమ్మతు చేస్తున్నందున ఈనెల 27న ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కెరర్లాలరావు తెలిపారు. గురువారం డీఈఈ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా రాయవరం, నదురుబాద, మహేంద్రవాడ, కొమరిపాలెం, తొస్సిపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేడు మండపేట రూరల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండపేట రూరల్ ఏడీడీలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ రత్నాలరావు చెప్పారు. ఏడీడ పరిసర ప్రాంతాల్లో మెయింటెనెన్స్‌లో భాగంగా చెట్టుకొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

సోమేశ్వరంలో ఆధార్ శిబిరం

రాయవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామ పంచాయతీ వద్ద గురువారం ఆధార్ శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో కీర్తి స్పందన ఆదేశాలపై పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఆధార్ శిబిరం నిర్వహించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, నూతన ఆధార్ నమోదు కోసం గ్రామానికి చెందిన 70 మంది ఈక్యాంప్‌లో సేవలు పొందినట్టు కార్యదర్శి తెలిపారు. శుక్రవారం ఆధార్ క్యాంప్ కొనసాగుతుందని గ్రామస్థులు ఆధార్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి పిలుపునిచ్చారు.

నేడు ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ


కెగంగవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంపై శుక్రవారం సామాజిక తనిఖీ ఏర్పాటు చేసినట్టు ఏపీవో పిగుపతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక ప్రారంభం అవుతుందన్నారు. ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.



ద్రాక్షారామంలో గురువారం రాత్రి ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

మొహర్రం సంతాప దినాలు ప్రారంభం

ద్రాక్షారామ,జూన్ 26(ఆంధ్రజ్యోతి): మొహర్రం సంతాప దినాలు ప్రారంభించారు. గురువారం రాత్రి నెలవంక దర్శనంతో మొహర్రం నెల ప్రారంభం అయింది. ద్రాక్షారామంలో మొహర్రం సంతాప దినాలను ప్రారంభించారు. ఇమాం అలీరజా పంజా నుంచి పీరును వెలుపాలెం, ద్రాక్షారామ వీధుల్లో ఊరేగించి ఇమాం అలీ రజా పంజాలో ప్రతిష్ఠించారు. పంజాను పూలతో అలంకరించి ఫాతిహా ఇచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చిన మతగురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మజలిస్ కాపీ చదివారు. మొహర్రం పురస్కరించుకుని మాతం నిర్వహించడం, నిప్పులపై నడవడం వంటి పలు కార్యక్రమాలు జరుపుతారు.



పాడి రైతులకు దాణా అందజేస్తున్న కూటమి నాయకులు

రాయితీపై పాడి రైతులకు దాణా పంపిణీ

కెగంగవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పశుసంవర్ధకశాఖ ఏడీఏ ఓ.రామకృష్ణ అన్నారు. గురువారం పామర్రు, కె.గంగవరం పశువుల ఆసుపత్రి వద్ద ఆయన పాడి రైతులకు 50 శాతం రాయితీపై 55 మంది పాడి రైతులకు దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పాడి రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బలుసు నాగేంద్ర, రాంబాబు, ఆయా ఆసుపత్రుల వైద్యులు సయ్యద్ లక్ష్మి, గ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.